క్లుప్తంగా

బాదంపూడిలో ఇళ్ల తొలగింపు



ఇళ్లను కూల్చుతున్న పొక్లెయిన్

ఉంగుటూరు: బాదంపూడి గ్రామంలో ఇరిగేషన్ కాల్వ గట్లపై ఉన్న ఎనిమిదిళ్లలో ఐదిళ్లను గురువారం తొలగించారు. ఎంపీడీఓ రాజీమనోజ్ పర్యవేక్షణలో ఈవోపీఆర్డీ చంద్రశేఖర్, ఈఓ రవికుమార్‌లు పొక్లెయిన్ల సాయంతో ఇళ్లను తొలగించారు.

విష్ణు ఆలయంలో దీపారాధన



స్వామివారికి దీపారాధన చేస్తున్న యువత

దెందులూరు : ధనుర్మాస పూజల్లో భాగంగా స్థానిక విష్ణు ఆలయంలో గురువారం మహిళలు స్వామివారికి వివిధ రకాల పుష్పాలతో విశిష్ట అలంకరణ చేశారు. దీపారాధన, ప్రత్యేక పూజలు నిర్వహించారు. అర్చకులు భక్తులకు స్వామివారి తీర్థ ప్రసాదాలను అందజేశారు.

నేడు సోషల్ ఆడిట్ గ్రామ సభలు

దెందులూరు: మండలంలోని మూడు గ్రామాల్లో శుక్రవారం జాతీయ ఉపాధి హామీ పథకం గ్రామ స్థాయి సోషల్ ఆడిట్ సభలు నిర్వహించనున్నట్టు ఉపాధి హామీ పథకం టెక్నికల్ అసిస్టెంటు ఫాతిమా శ్రావణ్ తెలిపారు. ఉదయం 10 గంటలకు జోగన్నపాలెం, 12 గంటలకు సానిగూడెం, మధ్యాహ్నం 2 గంటలకు శ్రీరామవరంలో సభలు నిర్వహిస్తామని, ప్రజలు హాజరుకావాలని కోరారు.

ఏజెన్సీ భూ సమస్యలపై వినతి



డీఆర్వోకి వినతిపత్రం అందిస్తున్న సీపీఎం నాయకులు

ఏలూరు (టూటౌన్): ఏజెన్సీ భూ సమస్యలు పరిష్కరించాలని, రెవెన్యూ అధికారుల తప్పుడు ప్రొటెక్షన్ ఆర్డర్లపై సమగ్ర విచారణ చేయించాలని, చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరుతూ సీపీఎం జిల్లా కమిటీ బృందం గురువారం డీఆర్ఓ విశ్వేశ్వరరావుకు వినతి పత్రం అందజేసింది. ఈ సందర్భంగా సీపీఎం జిల్లా కార్యదర్శి ఎ.రవి మాట్లాడుతూ గిరిజన చట్టాలకు లోబడి రెవెన్యూ శాఖ అధికారులు భూ సమస్యలను పరిష్కరించాలని కోరారు. గిరిజనులు తమ భూములు, హక్కుల కోసం చేస్తున్న పోరాటాలపై కొందరు పోలీసు అధికారులు, గిరిజనేతరులతో కుమ్మక్కై అక్రమ కేసులు బనాయిస్తున్నారని ఆరోపించారు. బుట్టాయగూడెం, జీలుగుమిల్లి మండలంలోని పలు గ్రామాల్లో కోర్టు ఆర్డర్లున్నా గిరిజనులపై అక్రమ కేసులు పెట్టిన సందర్భాలు అనేకం ఉన్నట్టు చెప్పారు. గిరిజనుల సమస్యలతో కూడిన వినతి పత్రాన్ని డీఆర్ఓకి అందించారు. కార్యక్రమంలో సీపీఎం కార్యదర్శి వర్గసభ్యుడు కె.శ్రీనివాస్, పి.రామకృష్ణ పాల్గొన్నారు.

స్వాతంత్య్ర పోరాటంలో సీపీఐ పాత్ర కీలకం



సీపీఐ శత వార్షికోత్సవాల ప్రారంభంలో పాల్గొన్న సీపీఐ శ్రేణులు

ఏలూరు (టూటౌన్): స్వాతంత్య్ర పోరాటంలో కమ్యూనిస్టు పార్టీ కీలకపాత్ర పోషించిందని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు డేగా ప్రభాకర్ పేర్కొన్నారు. సీపీఐ శత వార్షికోత్సవాల సందర్భాన్ని పురస్కరించుకొని స్థానిక సీపీఐ ఏలూరు జిల్లా కార్యాలయం స్ఫూర్తి భవనం వద్ద ఆయన సీపీఐ పతాకాన్ని ఆవిష్కరించి, వేడుకలను ప్రారంభించారు. స్వాతంత్య్ర సాధనకు అవిశ్రాంత కృషి చేసిన పార్టీ సీపీఐ అని ప్రభాకర్ కొనియాడారు. సీపీఐ రాష్ట్ర సమితి సభ్యుడు బండి వెంకటేశ్వరరావు మాట్లాడుతూ ఎన్నో త్యాగాల ఫలితంగా సాధించుకున్న హక్కులను గత 11 సంవత్సరాల కాలంలో కేంద్రంలో ఉన్న మోదీ ప్రభుత్వం కాలరాస్తోందని విమర్శించారు. ప్రజా సమస్యల పట్ల నిర్లక్ష్యం వహిస్తుందని ధ్వజమెత్తారు. కార్యక్రమంలో సీపీఐ ఏలూరు జిల్లా కార్యదర్శి మన్నవ కృష్ణ చైతన్య, ఏలూరు ఏరియా కార్యదర్శి ఉప్పులూరి హేమ శంకర్, జిల్లా కార్యవర్గ సభ్యులు పుప్పాల కన్నబాబు, కొండేటి బేబీ, ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు రెడ్డి శ్రీనివాస్ డాంగే, నగర అధ్యక్షుడు కె.కృష్ణమాచార్యులు, ఆంధ్రప్రదేశ్ మహిళా సమాఖ్య ఏలూరు జిల్లా కార్యదర్శి మన్నవ యామిని తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ చార్జీల బాదుడే బాదుడు

- వినియోగదారుల గగ్గోలు
- నేడు వైఎస్సార్ సీపీ పోరుబాట



విద్యుత్ సబ్ స్టేషన్

ఉంగుటూరు: ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను తుంగలోకి తొక్కి ప్రజలపై భారాలు మోపుతోన్న కూటమి ప్రభుత్వంపై సర్వత్రా ఆగ్రహం వ్యక్తమవుతోంది. గత ఆరు నెలల కాలంలో నిత్యావసర సరుకుల ధరలు పెరిగాయి. కూరగాయల ధరలు రోజుకో రకంగా పెరుగుతున్నాయి. తాజాగా కూటమి ప్రభుత్వం ప్రజలపై విద్యుత్ చార్జీలను నెలనెలా పెంచుతునే ఉంది. ఇందుకు అక్టోబర్, నవంబరు నెలల్లో వచ్చిన విద్యుత్ బిల్లుల పెంపే నిదర్శనం. యూనిట్‌కు వచ్చి సుమారు 40 పైసలు అంటే సుమారు 50 యూనిట్లు వాడే వినియోగదారుడుకి రూ.200 అదనంగా భారం పడింది. ఉంగుటూరు నియోజకవర్గంలో సుమారు 85 వేల గృహ, పరిశ్రమ, చేపలు చెరవులు, వ్యవసాయ సర్వీసులు ఉన్నాయి. ఈ వినియోగదారులంతా పెరిగిన విద్యుత్ బిల్లు మొత్తాలను చెల్లించలేక గగ్గోలు పెడుతున్నారు.

నేడు వాసుబాబు ఆధ్వర్యంలో పాదయాత్ర

ప్రజలపై విద్యుత్ భారాన్ని వ్యతిరేకిస్తూ మాజీ ఎమ్మెల్యే పుప్పాల వాసుబాబు ఆధ్వర్యంలో ఉంగుటూరు నియోజకవర్గ స్థాయిలో శుక్రవారం ఉదయం 10 గంటలకు నారాయణపురం సెంటర్ నుంచి విద్యుత్ ఏడీఈ కార్యాలయం వరకు పాదయాత్ర చేయనున్నారు. ఏడీఈకి పెంచిన విద్యుత్ చార్జీలపై వినతి పత్రం అందజేస్తారు. నియోజకవర్గంలోని వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు, వినియోగదారులు పాల్గొననున్నారు.

బాబు మార్క్ రాజకీయం

దెందులూరు: చంద్రబాబు మార్క్ రాజకీయాన్ని ఐదు నెలల్లోపే ప్రజలకు చూపించారు. ట్రూ అప్ బిల్లు పేరిట విద్యుత్ చార్జీలు పెంచేశారు. గత ప్రభుత్వంలో రూ.200 వచ్చే బిల్లు నేడు రూ.450 నుంచి 500 వరకు వస్తుంది. ఈ బిల్లుల మోతతో ప్రజలు గగ్గోలు పెడుతున్నారు. నియోజకవర్గంలోని దెందులూరు, పెదపాడు, పెదవేగి, ఏలూరు రూరల్ మండలాల్లో 1,06,000 గృహ విద్యుత్ కనెక్షన్లు ఉన్నాయి. యూనిట్‌కు ట్రూ అప్ చార్జీలు 45 పైసలు వరకు పెంచారు. విద్యుత్ వినియోగం పెరిగేకొద్దీ చార్జీలు కూడా శ్లాబుల వారీగా పెరుగుతాయి. పెంచిన విద్యుత్ బిల్లులు చెల్లించలేక ప్రజలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

నేడు దెందులూరులో పాదయాత్ర

కూటమి ప్రభుత్వం ప్రజలపై మోపిన విద్యుత్ భారాన్ని మాజీ ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి సూచనలతో శుక్రవారం ఉదయం 9 గంటలకు ఏలూరులోని అబ్బయ్య చౌదరి క్యాంపు కార్యాలయం నుంచి వైఎస్సార్ సీపీ శ్రేణులు ఏలూరు ప్రభుత్వాసుపత్రి వెనుక ఉన్న విద్యుత్ ఏడీఈ కార్యాలయం వరకు పాదయాత్ర నిర్వహించనున్నారు. అనంతరం ఏడీఈకి విద్యుత్ భారాలపై వినతిపత్రం అందజేస్తారు. దెందులూరు నియోజకవర్గంలో దెందులూరు, పెదపాడు, పెదవేగి, ఏలూరు రూరల్ మండలాల పార్టీ ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొంటారని పార్టీ యువజన విభాగం జిల్లా అధ్యక్షుడు కామిరెడ్డి నాని తెలిపారు.

అదనపు భారం అన్యాయం



ప్రజలపై విద్యుత్ చార్జీల భారం మోపడం అన్యాయం. చార్జీలు పెంచబోమని ఎన్నికల్లో హామీ ఇచ్చి, నేడు ఇంధన చార్జీలు పేరిట వసూళ్లు చేయడం సరికాదు. రాష్ట్రం మెత్తం మీదు రూ.15,485 కోట్లు ప్రజలపై అదనపు భారం మోపడం సిగ్గుచేటు. ఎస్సీ, ఎస్టీలకు ఉచిత విద్యుత్ సరఫరాను కొనసాగించాలి.

– యెలిశెట్టి పాపారావు బాబ్జి, సొసైటీ మాజీ అధ్యక్షుడు, వినియోగదారుడు

ప్రభుత్వమే భరించాలి



విద్యుత్ చార్జీలు రూ.200 నుంచి రూ.350కు పెంచారు. ఎనర్జీ, డిమాండ్, సర్ చార్జీలనే తేడా లేకుండా ప్రజలపై అదనపు భారం మోపారు. రూ.వెయ్యి వచ్చే బిల్లు రూ.1500కు పెంచారు. అదనపు భారంతో వినియోగదారులు ఇబ్బందులు పడుతున్నారు. పెంచిన చార్జీలను ప్రభుత్వమే భరించాలి.

– మరడ మంగారావు, వైఎస్సార్ సీపీ నేత, నారాయణపురం

చార్జీల బాదుడు సరికాదు



ఎన్నికల ప్రచార సభల్లో విద్యుత్ చార్జీలు పెంచబోమని నారా చంద్రబాబు హామీ ఇచ్చి అధికారంలోకి వచ్చారు. ఆరు నెలలు కూడా గడవక ముందే ప్రజలపై విద్యుత్ చార్జీల భారం వేశారు. ఇది ప్రజలను మోసం చేయడమే. పెరిగిన బిల్లులు చెల్లించలేక ప్రజలు ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

– కట్టా ఏసుబాబు, వినియోగదారుడు, దెందులూరు

ప్రజలకు న్యాయం చేయాలి



ఎన్నికల ప్రచారంలో ప్రజలపై ఎటువంటి భారం లేకుండా చూస్తామన్న కూటమి పార్టీల నాయకులు ఇచ్చిన హామీలను విస్మరించారు. ఇప్పుడు విద్యుత్ చార్జీలు పెంచి ప్రజలను మోసం చేస్తున్నారు. ప్రజలపై భారాలు మోపడం సిగ్గుచేటు. ఎన్నికల ప్రచారంలో నాయకులు ఇచ్చిన హామీలను అమలు చేయాలి.

– వి.చందు, వినియోగదారుడు, పోతునూరు

నేటి నుంచి విద్యుత్ సరఫరాలో అంతరాయం

భీమడోలు: స్థానిక సబ్‌స్టేషన్ పరిధిలో కండక్టర్ మార్పునకు శుక్రవారం నుంచి ఈనెల 31 వరకు గుండుగొలను, ఆగడాలలంక పరిధిలోని ఫీడర్లకు ఉదయం 8.30 నుంచి సాయంత్రం 4 గంటలకు వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తామని ఈఈ కేఎం అంబేడ్కర్ తెలిపారు. గుండుగొలను, భోగాపురం, బద్రికోడు, పైడిదిబ్బ, వడ్డిగూడెం, లక్ష్మీపురం, కోరుకల్లు, రత్నాపురం, ఆగడాలలంక, చెట్టున్నపాడు, మల్లవరం గ్రామాల్లోని విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని పేర్కొన్నారు.

నేడు యర్రమళ్ల సబ్‌స్టేషన్‌లో..

ఉంగుటూరు: యర్రమళ్ల సబ్‌స్టేషన్ పరిధిలోని కొత్తగూడెం, నాచుగుంట, గుళ్లపాడు, యర్రమళ్ల, సీలాద్రిపురం గ్రామాలకు శుక్రవారం ఉదయం 9 నుంచి 12 గంటలు వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని ఈఈ కేఎం అంబేడ్కర్ తెలిపారు.

నేడు గుడిగుంట పరిధిలో..

దెందులూరు: గుడిగుంట పరిధి గ్రామాల్లో శుక్రవారం ఉదయం 8 నుంచి 12 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయ ఏర్పడుతుందని ఈఈ కేఎం అంబేడ్కర్ తెలిపారు.

పెదపాడు సెక్షన్ పరిధిలో..

పెదపాడు : పెదపాడు సెక్షన్ పరిధిలోని గుడిపాడు, ఖాజీగూడెం, వడ్డిగూడెం, గోగుంట, వసంతవాడ, తోటగూడెం, పునుకొల్లు గ్రామాల్లో శుక్రవారం ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని ఏఈ రాంబాబు తెలిపారు.

విజయరాయి, పెదవేగి సెక్షన్ల పరిధిలో..

పెదవేగి : విజయరాయి సెక్షన్ పరిధిలోని విజయరాయి, రాయుడుపాలెం, బాపిరాజు గూడెం సబ్ స్టేషన్ల పరిధిలో శుక్రవారం ఉదయం 7 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని ఈఈ కేఎం అంబేడ్కర్ తెలిపారు. కవ్వగుంట సబ్‌స్టేషన్ పరిధిలో ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు కవ్వగుంట, గార్లమడుగు, జగన్నాథపురం, ములక్కాయపాడు, వంగూరు లక్ష్మీపురం గ్రామాలకు విద్యుత్ సరఫరా ఉండదని పేర్కొన్నారు.

నేడు వైఎస్సార్ సీపీ పోరుబాట

నిడమర్రు: ఏపీలో విద్యుత్ చార్జీల పెంపుపై వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పిలుపు మేరకు శుక్రవారం రాష్ట్రంలోని అన్ని విద్యుత్ సబ్ స్టేషన్ల వద్ద నిర్వహించే ధర్నాలను ప్రతి బీసీ విద్యుత్ వినియోగదారులు మద్దతు తెలిపి విజయవంతం చేయాలని ఆ పార్టీ రాష్ట్ర బీసీ సెల్ స్టేట్ వర్కింగ్ ప్రెసిడెంట్ నౌడు వెంకటరమణ కోరారు. గురువారం వైఎస్సార్ సీపీ పత్తేపురం కార్యాలయంలో ఆయన విలేకర్లతో మాట్లాడారు. వైఎస్సార్ సీపీ పోరుబాటకు బీసీలంతా అండగా ఉండాలని కోరారు. కూటమి సర్కారు అధికారంలోకి వచ్చిన ఆరు నెలలుకే ప్రజలపై రూ.15,845 కోట్లు భారం మోపడం విద్యుత్ వినియోగదాలను మోసగించడమే అని వివరించారు. ఎన్నికల హామీ మేరకు ఈ చార్జీలను ప్రభుత్వమే భరించాలని చేస్తున్న విజ్ఞప్తులను పట్టించుకోవడం లేదని ఆరోపించారు. ఇచ్చిన మాట తప్పి ఏకంగా రూ.6072 కోట్లు సర్దుబాటు చార్జీల భారం వేసి ప్రజలకు షాక్ ఇచ్చిందన్నారు. శ్లాబులు మార్చి ప్రజలపై అధిక భారం మోపిన చరిత్ర చంద్రబాబుదే అని విమర్శించారు. వైఎస్సార్ సీపీ పోరుబాటలో బీసీ సెల్ విభాగం కార్యకర్తలు, ప్రజలు, మహిళలు పెద్ద ఎత్తున పాల్గోవాలని వెంకటరమణ కోరారు.

పోరుబాటకు భారీగా తరలిరండి

నిడమర్రు: పెరిగిన విద్యుత్ చార్జీలకు నిరసనగా వైఎస్సార్ సీపీ శుక్రవారం కరెంట్ చార్జీల బాదుడుపై నిర్వహించే పోరుబాటకు నిడమర్రు మండలంలోని పార్టీ శ్రేణులు భారీగా తరలి రావాలని మండల కన్వీనర్ సంకు సత్యకుమార్ కోరారు. పార్టీ ఉంగుటూరు నియోజకవర్గం కన్వీనర్, మాజీ ఎమ్మెల్యే పుప్పాల వాసుబాబు ఆధ్వర్యంలో నారాయణపురం సెంటర్ నుంచి నారాయణపురం సబ్ స్టేషన్ వరకు ర్యాలీగా వెళ్లి అక్కడ అధికారులకు వినతిపత్రం అందిస్తామని తెలిపారు. వినియోగదారులంతా హాజరవ్వాలని కోరారు.

నారాయణపురం తరలి రావాలి

భీమడోలు: కూటమి ప్రభుత్వ కరెంట్ చార్జీల బాదుడుపై వైఎస్సార్ సీపీ పోరుబాట కార్యక్రమానికి ఉంగుటూరు మండలం నారాయణపురం సబ్‌స్టేషన్ వద్ద శుక్రవారం ఉదయం 9.30 గంటలకు తరలిరావాలని ఆ పార్టీ భీమడోలు మండల కన్వీనర్ రావిపాటి సత్యశ్రీనివాస్, మండల ప్రధాన కార్యదర్శి రామకుర్తి నాగేశ్వరరావులు కోరారు. మాజీ ఎమ్మెల్యే పుప్పాల వాసుబాబు ఆధ్వర్యంలో నారాయణపురం సబ్‌స్టేషన్ వద్ద ఉన్న తాధికారులకు కరెంట్ చార్జీలు తగ్గించాలని కోరుతూ వినతిపత్రం అందిస్తామని తెలిపారు.

భూ సమస్యల పరిష్కారానికి కృషి



పోలసానిపల్లిలో అధికారుల సమస్యలు వివరిస్తున్న రైతులు

భీమడోలు: భూ సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం కృషి చేస్తుందని మండల ప్రత్యేకాధికారి ఆర్‌వీ నాగరాణి అన్నారు. పోలసానిపల్లి గ్రామంలో గురువారం సర్పంచ్ షేక్ రహీమా బేగం అధ్యక్షతన రెవెన్యూ సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా నాగరాణి మాట్లాడుతూ సమస్యలపై 8 అర్జీలు వచ్చాయని, వీటిని గడువు తేదీలోగా పరిష్కరిస్తామని చెప్పారు. అనంతరం వివిధ రకాల ధ్రువీకరణ పత్రాలను దరఖాస్తుదారులకు అందించారు. కార్యక్రమంలో తహసీల్దార్ బి.రమాదేవి, ఆర్‌ఐ కిరణకుమారి, సర్వేయర్ ధర్మారావు, గ్రామ కార్యదర్శి యు.జయరామకృష్ణ, వీఆర్వో సాల్మన్ పాల్గొన్నారు.

వెల్లమిల్లిలో ఐదు అర్జీలు

ఉంగుటూరు: వెల్లమిల్లి గ్రామంలో గురువారం నిర్వహించిన రెవెన్యూ సదస్సుల్లో వివిధ సమస్యలపై ఐదు అర్జీలు వచ్చినట్టు తహసీల్దార్ పూర్ణచంద్ర ప్రసాదు తెలిపారు. సర్పంచ్ కుమార్ రాజా, వీఆర్ఓలు పాల్గొన్నారు. శుక్రవారం ఉదయం 10 గంటలకు బొమ్మిడి పంచాయతీ కార్యాలయం వద్ద రెవెన్యూ సదస్సు నిర్వహించనున్నట్టు తహసీల్దార్ పూర్ణచంద్ర ప్రసాదు తెలిపారు.

రంగా ఆశయ సాధనకు కృషి



భీమడోలులో రంగాకు నివాళులర్పిస్తున్న కాపు సంఘం నాయకులు, యువకులు

భీమడోలు: వంగవీటి మోహనరంగా ఆశయ సాధనలో ప్రతి ఒక్కరూ భాగస్వామ్యులు కావాలని కాపు సంక్షేమ సంఘం ప్రతినిధులు కోరారు. రంగా 36వ వర్ధంతి సందర్భంగా గురువారం భీమడోలు సంతమార్కెట్ వద్ద ఉన్న రంగా కాంస్య విగ్రహానికి పలువురు పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. రంగా తన జీవితాన్ని ప్రజా సేవకే అంకితం చేశారని గుర్తుచేశారు. ఈ సందర్భంగా వృద్ధులు, వికలాంగులు, పంచాయతీ పారిశుద్ధ్య కార్మికులకు పండ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో పెద్దలు పసుపులేటి శ్రీనివాస్, ప్రత్తి మదన్, దూసనపూడి పుల్లయ్య, చింతా రాము, పసుపులేటి సత్యనారాయణ, మద్దాల అప్పారావు. ముప్పిరిశెట్టి సుబ్రహ్మణ్యం, యర్రంశెట్టి ఏడుకొండలు, బొమ్ము పెద్ద సూరి, యువకులు పాల్గొన్నారు.

పిప్పరలో..

గణపవరం: దివంగత వంగవీటి రంగా ఆశయసాధనకు కృషి చేయాలని పలువురు పిలుపునిచ్చారు. పిప్పరలోని ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. రంగా సేవలను కొనియాడారు. కార్యక్రమంలో వైఎస్సార్ టీఎఫ్ జిల్లా కార్యదర్శి కాకర శ్యాంసన్, రంగా యువసేన సభ్యులు గరగ రవి, పాతంశెట్టి ప్రసాద్, మహేష్, కొరపాటి నరేష్ తదితరులు పాల్గొన్నారు.

పేదల ఆశాజ్యోతి రంగా

దెందులూరు: పేద బడుగు బలహీన వర్గాల ఆశాజ్యోతి వంగవీటి మోహనరంగారావు అని గోపన్నపాలెం మాజీ ఉపసర్పంచులు కొండేటి హనుమంతు, పూజారి శ్రీనివాసరావు అన్నారు. గోపన్నపాలెంలో రంగా విగ్రహానికి నాయకులు పూలమాలు వేసి నివాళులర్పించారు. గ్రామ నాయకులు కేబుల్ శ్రీను, బజార్ గణేష్, సీతారాములు, వెంకన్న బాబు, నితిన్, నాయుడు రామకృష్ణ, అల్లు శ్రీను, సురేంద్ర ఉన్నారు.

ముమ్మరంగా రబీ వరి నాట్లు



అంబర్‌పేట ఏరియాలో వరి నాట్లు వేస్తున్న కూలీలు

భీమడోలు: ఖరీఫ్ సాగు నష్టాలను మిగిల్చింది. ఆ నష్టాల నుంచి రబీ పంట గట్టెక్కిస్తుందన్న ఆశతో రైతాంగం సాగు పనుల్లో సమాయత్తమయ్యారు. ఇప్పటికే అప్పుల పాలైన రైతులు దాళ్వా సాగుపై ఆశతో మరోసారి అప్పులకు ఉపక్రమించారు. సార్వా ధాన్యం వర్షాలకు తడిచిపోవడంతో 10 రోజులకు పైగా రోడ్లపై రైతులు ఆరబెట్టారు. ఐనా తేమశాతం తగ్గకపోవడంతో రైతులు అయినకాడికి ధాన్యాన్ని దళారులకు అమ్ముకున్నారు. కూటమి ప్రభుత్వం పెట్టుబడి సాయం అందిస్తుందన్న రైతుల ఆశలు ఆడియాలయ్యాయి.

సాగు విస్తీర్ణం 12824 ఎకరాలు

భీమడోలు మండలం పాక్షిక మెట్ట మండలం. దాళ్వాలో 12,824 ఎకరాల సాగు విస్తీర్ణం కాగా ఇప్పటికే 641 ఎకరాల్లో నారుమడులు వేయాల్సి ఉండగా 632 ఎకరాల్లో నారుమడులు పూర్తి చేశారు. గ్రామాల్లో వరినాట్లు ముమ్మరంగా చేపట్టారు. బెంగాలీ కూలీలచే వరి నాట్లు వేస్తున్నారు. ప్రస్తుతానికి 1500 ఎకరాల్లో వరి నాట్లు పూర్తిచేశారు. మెట్ట గ్రామాలైన కోడూరుపాడు, దుద్దేపూడి, పోలసానిపల్లి, అంబర్‌పేట తదితర గ్రామాల్లో వరి నాట్లు 40 శాతం పూర్తయ్యాయి. మిగిలిన డెల్టా గ్రామాల్లో వరి నాట్లు జనవరి చివరి నాటికి పూర్తికానున్నాయి. అయితే సార్వా కన్నా దాళ్వాలో పెట్టుబడి ఎక్కువ అవుతుందని రైతులు ఆందోళన చెందుతున్నారు. ఎక్కువగా పీఆర్ 126, ఎంటీయు 1121 వరి వంగడాలను సాగు చేస్తున్నారు. వీటి పంట కాలం 120 నుంచి 130 రోజులు కావడంతో రైతులు వాటిపైనే మక్కువ చూపుతున్నారు.




గుండుగొలను ప్రాంతంలో నారు తీస్తున్న కూలీలు

సగం నిధుల ఖర్చుకే అవకాశం

- ఎట్టకేలకు వినియోగంపై క్లారిటీ
- నియోజకవర్గంలో 195 స్కూల్స్‌కు రూ.27.62 లక్షల నిధులు
- నిధుల పర్యవేక్షణకు పీఎంశ్రీ యాప్



జల్లికొమ్మర యూపీ స్కూల్లో బీరువా మరమ్మతు చేస్తున్న సిబ్బంది



నిధుల వినియోగం పర్యవేక్షణకు రూపొందించిన పీఎంశ్రీ యాప్

నిడమర్రు: ప్రభుత్వ పాఠశాలల్లో కనీస వసతుల కల్పన, స్వచ్ఛ కార్యక్రమాల అమలు, అవసరమైన సామగ్రి కొనుగోలు నిమిత్తం స్కూల్ వార్షిక గ్రాంట్‌లో 50 శాతం వరకు ఖర్చు చేసుకునే అవకాశం కల్పించారు. ఈ మేరకు విద్యాశాఖ మార్గదర్శకాలు జారీ చేసింది. ఈ నిధుల వినియోగం పర్యవేక్షణకు పీఎంశ్రీ అనే మరో కొత్త యాప్‌ను అందుబాటులోకి తెచ్చింది. ఉంగుటూరు నియోజకవర్గంలోని స్కూళ్ల హెచ్‌ఎంలు ప్రతి పాదనలను నవంబరు నెలలో ఆన్‌లైన్ చేశారు. అప్పట్లోనే ప్రతిపాదించిన నిధుల్లో 50 శాతం ఆయా స్కూల్స్ పీఎఫ్‌ఎంఎస్ ఖాతాల్లోకి అధికారులు జమ చేశారు. వీటి వినియోగంపై అవగాహన లేక అవి ఖాతాల్లోనే మూలుగుతున్నాయి.

ప్రతిపాదనల్లో 50 శాతమే మంజూరు

ఉంగుటూరు నియోజకవర్గంలోని 195 ప్రభుత్వ పాఠశాలల నిర్వహణ నిమిత్తం నవంబరు నెలలో రూ.55.25 లక్షలకు హెచ్‌ఎంలు ప్రతిపాదనలు ఆన్‌లైన్ చేశారు. వీటిలో 50 శాతం రూ. 27,62,500 నిధులు మంజూరు చేశారు. ఈ మేరకు పీఎఫ్‌ఎంఎస్ ఖాతాల్లోకి సమగ్ర శిక్ష ద్వారా నిధులు జమ చేశారు. 2024 ఏప్రిల్ నుంచి 2025 మార్చి వరకు పాఠశాల స్థాయిలో చేసిన ఖర్చుల బిల్లులను పీఎంశ్రీ యాప్‌లో అప్‌లోడ్ చేసి పీఎఫ్‌ఎంఎస్ ఖాతా నుంచి డ్రా చేసుకునే అవకాశం కల్పించారు. సాధారణంగా ప్రతి విద్యా సంవత్సరం ఆరంభంలోనే ఈ గ్రాంట్స్ విడుదలయ్యేవి. ఈ నిధులను విద్యాశాఖ సూచించిన మార్గదర్శకాలకు అనుగుణంగా పాఠశాల నిర్వహణ కమిటీఈ తీర్మానం చేసి ఖర్చు చేయాల్సి ఉంటుంది. ఈ ఖర్చు చేసిన ప్రతి బిల్లుకూ 2025 మార్చి తర్వాత ఆడిట్ ఉంటుందని అధికారులు తెలిపారు.

మండలం	స్కూల్స్	మంజూరైన నిధులు రూ.ల్లో
భీమడోలు	35	4,87,500
ఉంగుటూరు	65	9,47,500
నిడమర్రు	40	6,45,000
గణపవరం	55	6,82,500
మొత్తం	195	27,62,500

2022–23 రోల్ ఆధారంగా కేటాయింపులు

ఈ నిధులను 2022–23 పాఠశాలల్లో విద్యార్థుల నమోదు ఆధారంగా ప్రభుత్వం స్కూల్ గ్రాంట్ విడుదల చేసింది. రోల్ 1 నుంచి 30 వరకు రూ.10 వేలు, రోల్ 31 నుంచి 100 వరకు రూ.25 వేలు, 101 నుంచి 250 వరకు రూ.50 వేలు, 251 నుంచి 1000 వరకు రూ.75 వేలు, వెయ్యికి పైగా విద్యార్థులుంటే రూ.1 లక్ష నిధులు ఖర్చు చేసుకునే అవకాశం కల్పించారు. ప్రస్తుతం ఆయా నిధుల్లో 50 శాతం మాత్రమే ఖర్చుకు వెసులుబాటు ఇచ్చారు.

పీఎంశ్రీపై అవగాహన కల్పించాం



రోల్ ఆధారంగా విద్యాశాఖ పాఠశాల నిర్వహణ నిధులను ఆయా స్కూల్స్ పీఎఫ్‌ఎంఎస్ ఖాతాల్లోని నేరుగా జమ చేసింది. ప్రతిపాదించిన నిధుల్లో 50 శాతం మంజూరు చేశారు. ఈ నిధులను 2025 మార్చిలోపు పాఠశాలకు అవసరమైన అంశాలను ఎస్‌ఎంసీ తీర్మానం చేసి వినియోగించుకోవచ్చు. ప్రతి బిల్లు ఆన్‌లైన్ తప్పనిసరిగా చేయాలి. ఇందు కోసం రూపొందించిన పీఎంశ్రీ యాప్ పై హెచ్‌ఎంలందరికీ అవగాహన కల్పించాం.

– ఏవీఎస్ఎన్ భాస్కర్‌కుమార్, ఎంఈఓ–2, నిడమర్రు

పారిశుద్ధ్య కార్మికుల ధర్నాలు



ఆర్‌ఆర్‌పేటలోని మస్టర్ పాయింట్ వద్ద ధర్నా చేస్తున్న పారిశుద్ధ్య కార్మికులు

ఏలూరు (టూటౌన్): మున్సిపల్ కార్మికులకు తక్షణమే 12వ పీఆర్సీ ప్రకటించాలని, మధ్యంతర భృతి (ఐఆర్) ఇవ్వాలని, గతేడాది సమ్మె కాలపు ఒప్పందాలు అమలకు జీఓలు ఇవ్వాలని, ఇంజినీరింగ్ కార్మికుల జీతాలు పెంపుదల చేయాలని కోరుతూ గురువారం మున్సిపల్ కాంట్రాక్ట్ కార్మికులు ఏలూరు నగరపాలక సంస్థ పరిధిలోని వివిధ శానిటరీ సర్కిళ్లలో ధర్నాలు నిర్వహించారు. కార్యక్రమాల్లో సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి డీఎన్‌వీడీ ప్రసాద్, జిల్లా ఉపాధ్యక్షుడు బి.సోమయ్య, మున్సిపల్ వర్కర్స్ యూనియన్ నగర అధ్యక్షుడు లావేటి కృష్ణారావు, జిల్లా ప్రధాన కార్యదర్శి ఎ.జాన్‌బాబు, ఆటో డ్రైవర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి జె.గోపీలు పాల్గొని మాట్లాడారు. మున్సిపల్ ఉద్యోగుల, కార్మికుల సమస్యలను తక్షణమే పరిష్కరించాలని వారు డిమాండ్ చేశారు. లేకుంటే జనవరి 3, 10న కూడా ఆందోళనలు చేస్తామని వెల్లడించారు.